# వ్యాస కౌముది



## 'మరపురాని మనీషి' , "హరికథా పితామహ"
## శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు
## (31st August 1864 – 2nd January 1945)

***సంకలనం : యనమండ్ర వెంకట క్రిష్ణయ్య***



'హరికథ' అనే పేరువింటే శ్రీ నారాయణదాసుగారు, శ్రీ "నారాయణదాసుగారు" అనే పేరువింటే "హరికథ" తెలుగు రాష్ట్రములలో వెంటనే స్ఫురిస్తాయి. హరికథా రచనవల్లనూ, హరికథా ప్రయోగమువల్లనూ, శ్రీ దాసుగారివలే అఖండ ప్రఖ్యాతిని పొందినవారు వేరొకరు గానరు.

దాసుగారు 1864 ఆగష్టు 31న, రక్తాక్షి నామ సంవత్సర శ్రావణ బహుళ చతుర్దశినాడు ఆంధ్రప్రదేశ్ లోని విజయనగరం జిల్లా అజ్జాడ గ్రామంలో లక్ష్మీ నరసమాంబ, వేంకటచయనులు దంపతులకు జన్మించారు. దాసుగారు మన హిందూ దేశమున అవతరించిన అపర శారదావతారం. ఆయన అసలు పేరు సూర్యనారాయణ. హరికథకుడిగా ప్రసిద్ధి చెందాక, ఆయన నారాయణదాసుగా ప్రఖ్యాతిగాంచారు. అట్టి మహాపురుషుడు మన ఆంధ్ర దేశమున అవతరించుట మన ఆంధ్రుల అదృష్టము, గర్వకారణము. సంగీతం, సాహిత్యం మరియు నృత్యాల మేళవింపుతో హరికథ ప్రక్రియని సృజించి "హరికథా పితామహ" అనే బిరుదంతో ప్రఖ్యాతిగాంచారు. కవిత్వం, సంగీతం, నాట్యం అనే మూడు రంగాలలోనూ తనకున్న ప్రతిభను జోడించి నారాయణదాసు హరికథ అనే కళను అత్యున్నత శిఖరాలకు తీసుకొనిపోయారు. ఈ మూడింటి కలయికకూ భక్తి అనే భావం ప్రాణంగా హరికథలు రచన చేసినారు, చెప్పారు, నేర్పారు. తెలుగునాటనే కాక ఇతర రాష్ట్రాలలో కూడా హరికథా ప్రదర్శనలిచ్చి ప్రజల మన్ననలను పొందిన కళాకారుడాయన.

దాసుగారు హరికథా వాఙ్మయానికి ఆదిభట్టు, కావ్యశిల్పానికి కవిసామ్రాట్టు, కథాకల్పనకు ఆటపట్టు, కథావధానికి మూలవిరాట్టు,

నవరసాలకు కళానిధి, సంగీత సాహిత్యాలకు సరస్వతి, లయ బ్రహ్మ. దాసుగారిని స్మరించినపుడు "సంగీతమపి సాహిత్యం సరస్వత్యాః స్తనద్వయం" అనునది స్ఫురించును. నారాయణదాసు పుంభావ సరస్వతి.

దాసుగారు సహజకవి. వేద విద్య, రాగ యుక్తంగా పురాణపఠనము, అపరితమైన వేగంతో స్ఫుటంగా చదువుట, వ్రాయడం దాసుగారికి వంశపారంపర్యంగా వచ్చిన సహజ లక్షణాలు. సంగీతం, భరత శాస్త్రాభినివేశం, జ్యోతిషశాస్త్ర పరిచయాలు ప్రాధమికంగా కొంత గురువుల వల్ల తెలిసికొనగా, మిగిలిన ప్రతిభ వారి స్వయంకృషి.

దాసుగారు బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రాచీన వాగ్గేయకారుల కోవకు చెందినవారు. వారి బహుభాషా పాండిత్యము, సంగీత, సాహిత్య, నాట్యశాస్త్రముల జ్ఞానము అపారము. ఇన్ని సుగుణములు ఒకవ్యక్తి యందు ఉండుట దుర్లభము. వారి రచనలు పండితపామర జనరంజకములు. హరికథా పితామహులుగా, కథావాగ్గేయకారులుగా వారు ప్రఖ్యాతిచెందారు. మనదేశంలో హరికథారచనకు, ప్రచారానికి మార్గదర్శకులు. వారి లయపాండిత్యము అసాధారణమైనది. పంచముఖి, షణ్ముఖివంటి అసాధ్యములైన తాళములలో రచనలుచేసి గానంచేసి విద్వాంసుల మన్ననలు పొందిన ఘనవిద్వాంసుడు. దాసుగారు 'ఆట పాట మాట మీటలమేటి' గా ప్రసిద్ధినొందారు.



అజ్జాడాదిభట్ల నృత్య సంగీతాది కళలలోనేకాక సంస్కృతం, ఆంధ్రము, ఆంగ్లం, ఇంకా పర్షియన్, ఉర్దూ మొదలయిన భాషలను ఆపోసనముగా గ్రహించి పుక్కిటనుంచుకొన్న అగస్త్యుడు, మహావిద్వాంసుడు. తర్క వ్యాకరణాలలో, ధర్మ శాస్త్రములలో, మీమాంసా శాస్త్రములో, అనేక విషయాలలో ఆయన వ్రాసిన అసంఖ్యాక గ్రంధాలూ పరిశీలించిన వారికి ఇన్ని శాస్త్రాలలో ఈయన ఇంతటి ఘనమైన వైదుష్యం ఎప్పుడు గడించుకున్నారా ? అని ఆశ్చర్యము కలుగుతుంది. నారాయణదాసుగారు తెలుగునాట హరికథా పితామహులుగా, సంగీత విద్వాంసులుగా, గాయకశిఖామణులుగానే కాక కందగలిగిన కైతలు, కావ్యాలు విశేషంగా విరచించిన కవీశ్వరులు. వారి 'ఉమర్ ఖయాం' బహు భాషానువాద సంపుటి పరిశీలించిన వారికి వారి బహుభాషా వైదుష్యం ఆశ్చర్యము కలిగిస్తుంది.

శ్రీ దాసుగారు ఉన్నత దేహులు, ఒడ్డు పొడవు సమముగ గలవారు, స్పురద్రూపి, నేత్రములు నాసిక పెదవులు ప్రస్ఫుటములు, చిరునగవుతో నాట్యము చేయుచున్నపుడు , గంతు వేసిన్నప్పుడు, శంభో అని మహానాధం చేసినప్పుడు ఎల్లరు తన్మయులుకాక తప్పరు. దాసుగారి నృత్య, నాట్య గానములు అద్వితీయములు.

దాసుగారు ఎక్కడికక్కడ తెలుగులో, గీర్వాణములో, ఆంగ్లంలో , అరబ్బీలో, పర్షియన్, తమిళంలో ఉప మానోపామేయాలు, నానుడులు, ఆశుకవితలు విసురుతూ వుంటే వారి బహుముఖ పాండిత్యం వెల్లి విరిసింది. ఋగ్వేదము లోని కొన్ని కొన్ని సూక్తములను వారు ఆంధ్రీకరించినారు. దీని వలన వారికి వైదిక సంస్కృత మభ్యస్థమని చెప్పవచ్చును.

నారాయణదాసు ప్రఖ్యాత వైణికుడు. గీత, వాద్య, నృత్య త్రయ సమ్మేళనమే – సంగీత ప్రదర్శనము అనే సంగీత లక్షణమును ప్రమాణీకరించి, శ్రీ శివనారాయణతీర్ధుల వలె, సత్యమైన సంగీతము నారాధించినవారు దాసుగారు. రాగం ధారాళంగా ఆలపిస్తూ , స్వరాన్ని త్రికాలములలోను ప్రస్తారిస్తూ బహు చక్కనైన గమకంతో వైణిక మార్దంగికులకు పరిశ్రమ కల్పించేవారు. ఆ మహాపురుషుని సమక్షంలో ప్రక్కనున్న వైణికులు, మార్దంగికులు అతి సూక్ష్మరూపాలుగ కనిపించేవారు.

మైసూరు మహారాజు సంస్థానంలో దర్బారులో తన వీణావాద్య కౌశల్యంచే మహారాజు మెప్పులంది సన్మానాలు అందుకొన్నారు. తర్వాత విద్యలకు నిలయమైన విజయనగరంలో ఆనందగజపతి మహారాజుని విద్యా పరీక్షణ వేళలో మెప్పించి తదుపరి విజయరామ గాన పాఠశాల ప్రధమ ప్రధానాచార్య (1919లో) పదవినలంకరించి సుమారు పదునేడు వత్సరములు తమ సంగీతపాండితీ విధానమును పలువురు శిష్యులకు పంచిపెట్టిన




మహానుభావులు. ఆ రోజులలో సంగీత పాఠశాలయందు గురుకుల దాస పద్ధతిలో శిక్షణ వుండేది. శిష్యులను గురువులు కన్న బిడ్డలకంటే ఎక్కువ అభిమానంగా చూసేవారు. ప్రధానోపాధ్యాయులుగా నున్న దాసుగారు ప్రతీ రోజూ, ప్రతీ తరగతికీ వెళ్ళి, వారు సంగీతం ఏ విధంగా సాధన చేస్తున్నారో పరీక్షించేవారు. సంగీత పాఠములు సరళీలు, జంటలు, దాటు స్వరాలు, సప్త తాళ అలంకారము అన్నీ కూడా మూడు కాలములలో అభ్యాసము చెయ్యాలి. తరువాత గాని గీతరచనలు ప్రారంభము చేసేవారు కాదు. కీ. శే. నారాయణదాసుగారు విజయనగరమునకు ఒక అలంకారము. అనేక మహారాజుల, సరోజినీదేవి, రవీంద్రనాథ్ ఠాకూర్ వంటి మహనీయుల ప్రశంసలనందుకొన్న భాగ్యశాలి.

దాసుగారు తెలుగున రచించిన హరికథలు పెక్కు గలవు – జానకీ శపథము, రుక్మిణీ కళ్యాణము, గజేంద్రమోక్షము, ప్రహ్లాదచరిత్ర, ధ్రువోపాఖ్యానము, మార్కండేయోపాఖ్యానము, భీష్మచరిత్రము, సావిత్రీచరిత్రము, యదార్ధ రామాయణము మున్నగునవి వారు రచించిన హరికథలు. హరికథలుకాక పెక్కు శతకములను (శ్రీరామచంద్రశతకము, కాశీశతకము) , కావ్యములను (ఉమర్ ఖయాం, బాటసారి), జగజ్జ్యోతియను వేదాంత గ్రంధమును, తారకమను శృంగార ప్రబంధమును, 'నవరసతరంగిణి' అను సంగీతశాస్త్ర గ్రంధమును రచించినారు.

నూనూగు మీసాల నూతనయౌవ్వనము నుండి జీవితాంతం వరకు హరికథా రచనలు చేస్తూ, వేలాదిగా హరికథలు వినిపిస్తూ, కలకత్తా నుండి కన్యాకుమారి వరకు దాసుగారు దేశ పర్యటనలు చేసేవారు. చిన్న గ్రామాలు మొదలు – మహా పట్టణములు, అనేక సంస్థలలో, పరిషత్తులలో, విద్వత్సభలలో, దేవాలయాలలో, కోటలలో, రాజ దర్బారులలో, అంతఃపురాలలో వారు చేసిన హరికథా గానములు వేలకుమించి ఉన్నాయి. సామాన్యులు మొదలుకొని ప్రతిభావంతులు, అష్టావధాన శతావధానములు చేసిన దిగ్గంతులైన శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు, కాశీ క్రిష్ణమాచార్యులుగారు, జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు, ఆచార్య సర్వేపల్లి రాధాక్రిష్ణ (రాష్ట్రపతి) గారు మొదలుకొని వివిధ రాజకీయ ధురంధరులు, మద్రాసు ప్రెసిడెన్సీ హై కోర్ట్ న్యాయమూర్తులు మొదలు వకీలు గుమాస్తాల వరకు, పోలీసు శాఖోద్యోగులు – వీరు వారు అనడం ఎందుకు? అన్ని వర్గముల వారు వేలాదిమంది నారాయణదాసుగారి హరికథా గానానికి, కవితాశక్తికి, సంగీత–లయల పాండిత్యానికి, అష్టావధానాలకు ముగ్ధులై ఆనందిచేవారట. వారు సభలో వున్న సభకు నిండు. వారితో సంభాషించుటకు పండితులు, కవులు భయపడెడివారు. వారు రామాయణ యక్షగానమును రచించి, దేశములో అనేకమంది హరిదాసులను శిష్యపరంపరగా తయారుచేసినారు. ఆయన హరికథ వినడం ఒక గొప్ప అనుభూతిగా అప్పటివారు చెప్పుకొనేవారు.

విజయనగరము విద్యల నగరమని చాటి చెప్పిన ఘనులు. గ్రామఫోను రికార్డింగు మనదేశములో ఇంకా అందుబాటులోలేని ఆరోజులలో మైసురు మహరాజావారు దాసుగారిచేత కొన్ని పాటలు ప్రత్యేకముగ పాడించి, ఫోనోగ్రాఫ్ రికార్డింగు చేసినట్లు తెలుస్తోంది.

ఒకమారు నారాయణదాసుగారు కలకత్తాలో 'శ్రీకృష్ణ జననము' హరికథను సంస్కృతంలో గానం చేస్తూ హిందీలో భావాన్ని వివరించుచూ, మూడున్నర గంటలసేపు ప్రేక్షకులను మైమరపించారు. ఆ హరికథను ఆసాంతం విన్న రవీంద్రనాథ్ ఠాగూర్ గారు వేదికమీదకి వచ్చి దాసుగారిని ఆలింగనం చేసుకుని అభినందనలు తెలియచేసి 'ఇంతటి అమర గానాన్ని ఎవరివద్ద అభ్యసించారు' అని ప్రశ్నించారు. దానికి దాసుగారు చిరునవ్వుతో 'దేవునిదగ్గర' అని సమాధానం ఇచ్చేరుట.

వీరి శిష్యులలో పేరుమోసినవారిలో వాజపేయాజుల సుబ్బయ్యదాసు, నేతి లక్ష్మీనారాయణ భాగవతులు (విజయవాడ), నేమాని వరహాలుదాసు, వేదనభట్ల వెంకటరమణయ్య, వడ్లమాని నరసింహదాసు, శంబరిదాసు, చొప్పల్లి సూర్యనారాయణ భాగవతార్ , పిల్లలమఱ్ఱి రామదాసు భాగవతులు మున్నగువారలు గలరు. దాసుగారి అపూర్వ నృత్యకళా కౌశలము కొంచెము సుష్టుగా పట్టుబడినది కొందరికే – వారు

వాజపేయాజులవారు, నేతివారు, వడ్లమానివారు, కరూరు క్రిష్ణదాసుగారు.

దాసుగారి శిష్యవర్గంలో శ్రీ నేతి లక్ష్మీనారాయణగారిదొక విశిష్ట స్థానము. హరికధా జీవనులై సంగీతాన్ని ఆరాధించిన కళాకారులలో అత్యంత ప్రముఖులైనవారు నేతి లక్ష్మీనారాయణ భాగవతులు. వీరు గుంటూరు జిల్లా తెనాలి తాలూకా నూతక్కిలొ 1897 ఆగష్టు 25న జన్మించారు. వీరి తల్లితండ్రులు సంగీత కళాపోషకులైన నేతి వెంకటప్పయ్య, మహాలక్ష్మమ్మ. లక్ష్మీనారాయణ భాగవతులు పూర్వము వేద విద్యార్ధి. ఆదిభట్ల నారాయణదాసుగారి సమాహార కళాసాగరమైన హరికథ ఆయనను ఆకర్షించినది కాబోలు.

సహజసంగీత సాహిత్య కోవిదులు, మహాకవి సార్వభౌములు, బహుభాషావేత్తలు, భావ రాగ, తాళసర్వశబ్ద ప్రభంధ కల్పనా సమంచిత పంచ ముఖీస్వరస్తోత్ర సహస్రావధాన ధురీణులు, స్వవిరచిత నానావిధానేక సంస్కృతాంధ్ర కావ్యోత్తమ సంపాదిత సంపూర్ణ యశశ్చంద్రికాధవళిత దసదిశావకాశులు, హరికథాగాన వాగమశాసనులు, భాగవత శిఖామణులు, హరికథాగాయకులకు భుక్తి ముక్తులను ప్రసాదించిన నిత్యానన్దమూర్తులు, కాత్యాయనీకటాక్ష విభవలబ్ధజ్ఞానధనులై మోక్ష సామ్రాజ్య మలంకరించిన 'హరిదాస జగద్గురు" శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాస సద్గురుపాదులు నేతి లక్ష్మీనారాయణవారి గురువర్యులు. దాసుగారు హరిదాస జగత్తుకే గురువులు -- కాని వారు (దాసుగారు) ఆయనను 'నా శిష్యుడని' చెప్పుకోవాలని లక్ష్మీనారాయణవారి ఆశయం. ఆ మహద్భాగ్యం కోసము వారు చేసిన తపస్సు ఫలించింది. ఆ ఫలమే వారి జీవిత కుసుమానికి పారిజాత సౌరభాన్ని ప్రసాదించింది.

నేతివారి మాటల్లో -- **గురువుగారంటే సంగీతసాహిత్యాలు మూర్తీభవించిన "పుంభావ సరస్వతి".** వారు కథకు నిలబడి చెపుతుంటే సర్వశాస్త్రాలు, కళలు నవరస సమ్మేళనం పొంది ఆకాశగంగా ప్రవాహాన్ని పోలిన గాన రసంతో పెల్లుబుకుతూ సాక్షాత్తు పరమాత్ముని విశ్వరూపాన్ని తలపుకు తెచ్చేది. శ్రీవారి హరికథాగానం కాకినాడ సరస్వతీ గానసభలో మొట్ట మొదట విన్నారు. ఈ కథాకథన వ్యాసంగం కూడా చేస్తూ ఉండడంచేత నాటినుండే శ్రీవారి శుశ్రూషకు కంకణం కట్టుకొన్నారు . కాకినాడలోనే వారి బసలో చేరి, ఒకటి రెండు మూడు సంవత్సరములు వరుసగా వెళ్లి వారి గురువుగారికి సర్వోపచారములు చేసారు. అయితే ఏం, నేతివారికి దాసుగారు గురువులేకాని వారింకా దాసుగారికి శిష్యుడు కాలేదు. శ్రీవారి పరిచర్యకు శ్రీవారి సోదరులు శ్రీ పేరన్నగారు అనుమతి ఇచ్చారట. ఈ మూడు సంవత్సరములలో, శ్రీవారి కృపా కటాక్షం నేతివారిపై ప్రసరించినది. నాటినుండే "శ్రీవారికి ప్రియశిష్యుడనని" సగర్వంగా చెప్పుకొనేవారు.

ఇంకేముంది? కాకినాడనుంచి విజదశమి దర్బారుకు విజయనగరం ప్రయాణం. గురువుతో శిష్యుడు కదా ! గురువుగారింటికే సరాసరి వెళ్లారు. దాసుగారికి వీరిమీద పుత్రవాత్సల్యము. పంక్తిని భోజనంపెట్టి లాలించి మన్నించారు. శ్రీ వాజపేయాజుల సుబ్బయ్యదాసుగారు అంతకు పూర్వమే శ్రీవారికి శిష్యులుగా ఉన్నారు. వారుభయులకు విజయనగరం సంగీత కళాశాలలో కూర్చోపెట్టి ఆ విజయదశమి నాడే అనన్దమానన్దమాలించినన్ బాల : అనే కీర్తన ఆరంభిచారు. ఇచట బాల! అంటే దాసుగారు రచించిన యదార్ధరామాయణం శ్రీమతి గురుపత్నికి అంకితం చేయబడింది.

అయితే గురుపంక్తిని భోజనం అల్లుళ్లుగా ఎన్నాళ్ళు చెయ్యటం అని నేతివారికి పెద్ద సమస్యగా అనిపించి -- పూర్వం పేద విద్యార్ధి గనుక "ఉపనయనం నాటి మాట ఉన్నది గదా" అని మాధుకరానికి బయలుదేరారట. దీనికి ముందు గురువనుజ్ఞ తీసికోలేదు. మధ్యాన్నం 12 గంటలవేళ మాధుకరం లభించిందట. ఆకస్మికంగా సుబ్బయ్యగారు నేతివారిని బజారులో కలసికొని గురువుగారు "నిన్ను వున్నవాణ్ణి ఉన్నట్లు రమ్మన్నారు" అన్నారట. ఏదో కొంప మునిగిందని ఆ "భిక్షక' రూపంలోనే వెళ్లారట గురువుగారి దగ్గరకి. దాసుగారు నేతివారిని చూచి ఒక నవ్వు నవ్వి, నేటినుండి నువ్వు నా సహపంక్తినే భోజనం చేస్తావు అన్నారట. ఎంత అదృష్టం ! నిత్యం బ్రహ్మముహూర్తంలో లేచి అనుష్టానము పూర్తిచేసుకొని భాగవత పారాయణం చేసుకొనే సమయంలో గురువుగారు "రారా" అనేవారట. గురు శిష్యులిద్దరూ గోక్షీరంతో "కాఫీ" సేవించేవారట.

ఇంటినుండి సంగీతకళాశాలకు దాసుగారి వెంట రామాయణ కధాగానము చేయుచు వీరును సుబ్బయ్యగారును వెళ్ళుచు మార్గమధ్యమందే గురుశుశ్రూష చేయుట ఒక పరిపాటి . ఒకరు గొడుగు ఇంకొకరు పుస్తకం పట్టుకొని వెళుతూవుంటే దాసుగారు ముందు నడిచేవారట. ఆ సన్నివేశమును, సంగీత కళాశాలలో గణపతి నవరాత్రులు జరిపి చివరి దినమున ఊరేగింపు ఉత్సవములో విజయనగర వీధులలో దాసుగారు గీతనృత్యములు పఠించు చుండగా వారి వెనక ఈ శిష్యద్వయము వంతపాడు సన్నివేశము తిలకించిన పురజనులు వాల్మీకి వెంట కుశలవులను జూచిన స్ఫురణగలిగించి పులకించి పోయెడివారు. సుబ్బయ్యగారికి, నేతివారికి "రామాయణం" ఆరు కాండలు ఆరు కధలుగా పూర్తిగా చెప్పి దాసుగారు

వారుభయులను **"రామాయణ సోదరులు"** అనే నామకరణం చేసారు. నాటి నుండి ఆ సోదరుల సహకారగానం గురువుగారి కథకు తప్పకుండా ఉండేదట. మదరాసు అఖిలభారత కాంగ్రెస్ మహాసభలకు సభాప్రారంభకులుగా వెళ్ళిన గురువుగారి వెంట వీరిరువురును వెళ్లి అక్కడ జరిగిన అనేక హరికథలలో గురుదేవునితో శ్రీ వేపా రామేశం ప్రభృతుల ప్రశంశలకు పాత్రులైనారట. పిఠాపురంలో నెలదినములు దాసుగారు యధార్థ రామాయణము చెప్పినప్పుడు శ్రీ నేతివారు సహకారగానము చేసి వీణ సంగమేశ్వరశాస్త్రి, దెందుకూరు నరసింహశాస్త్రి ప్రభృతుల ప్రశంశలను దాసుగారితోపాటు శిరసావహించారు. దాసుగారికడ వారి పంద్రెండు హరికథలను వల్లించిన మహాయోగము ఈ రామాయణ సోదరులకే పట్టినది. శిష్యులంటే కేవలం సహకారగానం చెయ్యటమే కాకుండా, కథకు ముందు మంచి గంధం అరగదీసి శ్రీవారి భుజాలకు వక్షస్థలానికి రాసేవారట.

నేతివారి నృత్యగానములు శాస్త్రశాణ రేఖాయితములై రసజ్ఞ పారిషదరంజన శ్లాఘన పాత్రములై దాసుగారిచే సేహభాసనిపించుకొన్నవి. వారు హరికథనభ్యసించి అందులోనే జీవించినప్పటికీ, మనసా సంగీతాన్నే ఆరాధించారు. వీరు 'గాయక సార్వభౌమ' కీ. శే. శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారి వద్ద కూడా సంగీత సాధన చేసిన మహనీయులు. చిన్ననాడే తన ఇంట చేసిన వేదాధ్యయనం హరికథాగాన ప్రవాహానికి మరింత దోహదకారి అయ్యింది. మృదు మధురమైన కంఠం, మాటల్లో స్పష్టత, శరీరంలోని అణువణువు నిండిన లయపాండిత్యం వెన్నతో వచ్చిన సిరులు. అందువలననేమో, చాలాకాలం పాటు గురువుగారైన 'హరికథా పితామహ' ఆదిభట్ల నారాయణదాసుగారికి కథలలో వంతపాట పాడేవారు.

దాసుగారు 9-11-1933న తునిలో కథ చెప్పినప్పుడు సహకారగానానికి నేతివారు వెళ్లారు. అప్పటికే దాసుగారి కథలను వారి సన్నిధిలో శుశ్రూష చేయకుండగనే కొందరు హరిదాసులు చెప్పుటయు, ఆ చెప్పుటలో వారి సంప్రదాయమునకు చెరువు చేయుటయు కద్దు. అది గమనించి దాసుగారు అట్టివారికి రిజిస్టర్ నోటిసులిచ్చి కథలను మధ్యలో అపుచేయించేవారట. అట్టి యొక ఘట్టములో ఆవేశవశంవదులైన దాసుగారు వెంటనే ఆ తునిలోనే 11-11-1933న నేతివారికి సాధికారముగా ఒక సనదు (అనగా సర్టిఫికేట్) వ్రాసి సంతకము చేసి యిచ్చిరి. ఏ విశ్వవిద్యాలయ పట్టానికి లేని గౌరవము ఇట్టి సనదుకు ఉందని ఉప్పొంగిపోయారట నేతివారు. (**సనదు సారాంశము - "నేతి లక్ష్మీ నారాయణ భాగవతునకు ఆదిభట్ల నారాయణదాసు వ్రాసి ఇచ్చిన యనుమతి. నీవు నాయొద్ద శుశ్రూష చేసి నేర్చుకొన్నావు కనక నారచించిన యక్షగానములు హరికథలుగా నీవు సభలలో నృత్య గీత వాద్య సహితముగా సభలలో నిచటి నుండియు విన్పించ వచ్చును. -- ఆదిభట్ల నారాయణదాసు వ్రాలు, 11-11-33, తుని** )



'హరికథా కేసరి' కీ. శే. నేతి లక్ష్మీనారాయణ భాగవతులు [1897-1979]

లక్ష్మీ నారాయణ భాగవతులవారి సంగీత నిర్వహణలో విజయవాడ ఆకాశవాణి కేంద్రములో దాసుగారి యక్షగానములైన రుక్మిణీ కళ్యాణము, పాదుకా పట్టాభిషేకం అనే హరికథలు సంగీత రూపకములుగ ప్రసారము గావించబడి రసికుల మన్ననలు పొందాయి. గురువర్యులు ధరించిన మంచిగంధపు పాదుకలు, వారి కాలి గజ్జులు, చిరుతాళములు, చేతికర్ర తమ యింట పుజామందిరమున - భరతుడు శ్రీరాముని పాదుకలకు పట్టాభిషేకం చేసినట్లు తన జీవితాంతం వాటిని పూజించారు. ఇంతటి గురుభక్తి పరాయణునీ నవయుగమున మరి చూడబోము !

శ్రీ నారాయణదాసుగారు రచించిన "జానకీ శపధము" హరికథ ఒక సంగీత కళాఖండం. అందులో వారు పూర్వాంగ, ఉత్తరాంగములకు చెందిన 35 రాగాలను తీసి, వానిలొ కీర్తనలు వ్రాసారు . ఆ కీర్తనలు గానం చెయ్యడానికి అసాధారణ సంగీత ప్రజ్ఞాపాటవములేనిచో గానము చెయ్యడం కష్టం. ఉదాహరణకు శ్రీరాముడు కుశలవుల అమరగానమున అచ్చెరువొంది "ఏ యూరెవ్వారి తనయు లెరింగింపుదు బాలులారా" అనే కీర్తనను 72వ మేళకర్తయైన రసికప్రియలొ రచించారు. కొంతమంది పాడలేక ఆ కీర్తనను చక్రవాక రాగములో పాడేవారట. "జానకీ శపధము" కీర్తనలు పాడాలంటే సంగీత

విద్వాంసుడైయుండాలి గానీ, ఆపాటి – ఈపాటి జ్ఞానం కలవారు పాడలేరు. ఇప్పుడు ఎవరికి తోచిన సులభ రాగాలలో వారు పాడుచున్నారు. దాసుగారి శిష్యులలో ముగ్గురు మాత్రం రాగములు చెడకుండా పాడేవారని అనేవారు. వారు – వాజపేయాజుల సుబ్బయ్యదాసుగారు, నేతి లక్ష్మీ నారాయణ భాగవతులు మరియు నేమాని వరహాలదాసుగారు.

శిష్య వాత్సల్యములో దాసుగారికి సాటి ఎవరూ ఉండరని కూడా ప్రఖ్యాతి ఉంది. అభినవాగతులైన శిష్యులందరికీ సర్వసదుపాయములను దాసుగారే సమకూర్చేవారు. తమ యింట కుదెరినా సరే, లేకున్న తామెరిగిన సంపన్నులచే వారికి భోజనవారములు ఏర్పరిచేడివారు. జేబుఖర్చులకు వారికి డబ్బులు గూడా ఇచ్చుచుండెడి వారట. శిష్యులకు బిడియము పోగొట్టుటకు, హరికథ కింత ప్రచారము కల్గించి వారి కిహపరముల కింత యుపాధి చూపుటకును నడివీధియందు తాను గజ్జెకట్టి నాట్యము చేయుచు వారిని పాడమనుచు, తాను తాళము వేయుచు వారిని ఆడుమనుచు అక్కడికక్కడ శిష్యులకు విద్య నూరి పోసేడివారు.




అసంఖ్యాకులైన హరిదాసులకు మార్గదర్శియై వారి భుక్తికి, ముక్తికి దారి చూపించిన మహనీయులు కనుకనే తిరుపతి వేంకట కవులు "దాసు నారాయణునకు నీతండు, వీని దాసు లెల్లడగల హరిదాసులెల్ల నొక్క హరిదాసులేకాదు, నిక్కమితని యెడల నాద్రుతి లేనివాడు ఎవడు బుడమి." అని ప్రశంసించారు

శ్రీ నారాయణదాసుగారి భక్తిని, శక్తిని శ్రీ చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారు ఇట్లు ప్రసంసించిరి 'ప్రహ్లాద నారద పరాశర పుండరీక .... అన్న పరమ భక్తులలో పరిగణింప తగ్గవాడు; అంతరంగము బహునిర్మలమైనది; ప్రపేదిరే ప్రాక్తనజన్మ విద్యాః అను కాళిదాసోక్తి ఈతనియందు సమన్వయించినట్లు మరియొకరియందు సమన్వయించదు".

నారాయణదాసు సంగీత ప్రతిభ, ఆయన సాహితీ ప్రకర్షణ సమస్థాయిలో పరిమళించింది. ఆనాటి సంగీత విద్వాంసులు ఆయనను 'లయ బ్రహ్మ', 'పంచముఖి పరమేశ్వర', 'ఆట పాట మాట మీటల మేటి', 'సంగీత సాహిత్య సార్వభౌమ' అని సన్మానించారు. ఒకేమారు ఐదు తాళాలకు అనుగుణంగా పాడడం ఆయన ప్రత్యేకత. ఈ పంచముఖి ప్రదర్శనలో నారాయణదాసు రెండు చేతులు, రెండు కాళ్ళు, తలతో ఐదు తాళాలకూ దరువు చూపేవాడు. అప్పుడు ఆయనకు ఐదుగురు వివిధ వాద్యకారులు సహకరించేవారు. సుమారు ఆరున్నర దశాబ్దాల సంగీత, సాహిత్య, హరికథా కళా ప్రస్థానంలో ఆయన అందుకోని సన్మానం లేదేమో. రాజ సన్మానాలూ, పౌర సన్మానాలూ, బిరుదు ప్రదానాలూ, గజారోహణలు, సువర్ణ ఘంటాకంకణ ధారణలూ, గండపెండేర ధారణలూ ఇలా ఎన్నెన్నో గౌరవాలు ఆయనకు లభించాయి.

ఆదిభట్ల నారాయణ దాసుగారు తెలుగులో, అచ్చతెలుగులో, సంస్కృతంలో సుమారు ఏభై గ్రంధాలను రచించారు. వాటిలో స్వతంత్ర కావ్యాలు, ప్రబంధాలు, అనువాద గ్రంధాలు, వచన గ్రంధాలు, కవితా సంపుటాలు, శతకాలు, వేదాంత పరిశోధనలు, సంగీత ప్రబంధాలు, హరికథలు, పిల్లల నీతికథలు వగైరా ఉన్నాయి. అన్ని కళలలో ప్రావీణ్యం గల ఆయనను 'ది హిందూ' పత్రిక (జూన్ 30, 1894) బహుముఖ ప్రజ్ఞాశాలిఅని శ్లాఘించింది. "మేఘ గంభీర నిస్వనంబున దిసావలయంబు మారుమ్రోతల ధ్వనించు" అని "ఒక కవి – కథకరత్న" దాసుగారిని ప్రశంశించాడు. ఆ మహనీయుడు తెలుగు జాతికి అధ్భుతమైన, అనన్య సామాన్యమైన, అనితర సాధ్యమైన, అజరామరమైన సాహిత్య సంపదను కానుకగా ఇచ్చారు.

శ్రీ దాసుగారి గురించి యెంత వ్రాసినా, చెప్పినా తక్కువే అవుతుంది. ఈ సందర్భములో కళాకమనీయమైన ఆ మహామహుని జీవతములో రసవత్తర సన్నివేశములు అనేకములు కలవు. వానిలో మచ్చుకకు కొన్ని ఇచట ఉదాహరించుటమైనది.

1883లో (అప్పటికి దాసుగారికి 19 సంవత్సరముల వయసు) విజయనగరమున దాసుగారు మెట్రిక్యులేషను చదువుచుండగా కుప్పుస్వామినాయుడను హరిదాసు చెన్నపట్టణమునుండి వచ్చి కానుకుర్తివారి యింట 'ధ్రువచరిత్రము' చెప్పుచుండగా తిలకించిన సన్నివేశము, దాసుగారి హరికథావతారమునకు నాంది అయినది.

1884లో దాసుగారి చరిత్రలో ఛత్రపురమున నొక విచిత్ర సంఘటన జరిగినది. ఒక పెండ్లి పెద్ద కోరికపై దాసుగారు వారి యింట 'ధ్రువచరిత్రము' హరికథ చెప్పిరి. అది విని పెండ్లి పెద్ద దాసుగారితో 'అంబరీష చరిత్రము' నాకొడుకునకు ఇష్టము, కవిత్వము చేసి విన్పించగలవా? నీకు పది దినములు గడువిచ్చిన' అన్నారుట. ఆ రాత్రికి రాత్రి పంతము పట్టి మతి బృహస్పతియగు దాసుగారు అంబరీష చరిత్రమును రచించి, మరునాడు ఉదయము తొమ్మిది గంటలకు హరికథ అద్భుతముగా గానము చేసిరట.

'విజయనగర గర్వకారణము' – మదరాసు హైకోర్ట్ న్యాయవాది శిరోమణి రాయ్ బహాదూర్ శ్రీ పనప్పాకం ఆనందాచార్యులవారి నివాసములొ దాసుగారు 'అంబరీష చరిత్ర' హరికథాగానం చేసిరి. సత్కవి యనియు, బహుముఖ ప్రతిభాశాలి యనియు ... విజయనగర వైభవ గర్వకారణమనియు, బహుధా శ్లాఘింపబడిరి. (హిందూ, 30-6-1894)

తేది 25-8-1894న బెంగుళూరులో మైసూరు ప్రభుత్వోన్నతాధికారుల యెదుట దాసుగారు సంగీత కాలక్షేపము చేసినప్పుడు, ఆనాటి రాత్రి వారి గౌరవార్థము ఏర్పాటుచేసిన విందులో ఉన్నత న్యాయాదిపతియైన శ్రీ రామచంద్ర అయ్యర్ గారు దాసుగారిని '**ఉత్తర సర్కారుల సంపద**' అని అభివర్ణించారు. (హిందూ, 29-8-1894)

1904లో కాకినాడలో 'సరస్వతీ గాన సభ' స్థాపితమైనది మొదలు 1942 వరకు ఏటా ఆ సభకు దాసుగారి కథతోనే బోణీ జరుగుచుండేది. ఏ పాట కచ్చేరికిరాని 'గేటు కలక్షను' దాసుగారి హరికథకు వచ్చేదట.

విజయనగర ప్రభువులు "మా దర్బారులో నీవేమైనా సర్వీసు జేయ గొరెదవ?' యను రాజావారి ప్రశ్నకు – "మర్త్యులను గొల్వ నొల్లను" అని దాసుగారు సమాధానమిచ్చిరట.

1908 – 14 సం. ల నడుమ బరంపురము, విశాఖపట్టణము, కాకినాడ, రాజమహేంద్రవరము, బందరు మున్నగు పలుతావుల ప్రజలు దాసుగారి హరికథలకు, వారికి అనేక సువర్ణఘంటా కంకణములు, పదకములు, భుజకీర్తులు సమర్పించారు. మరియు నూజివీడు, నందిగామ, వెంకటగిరి, హైదరాబాద్, భద్రాచలము మొదలైన పలుతావుల గజారోహణము, ఘనసన్మానము లనేకము జరిగినవి.

1911-12 ప్రాంతమున బరంపురములో జిల్లా జడ్జి సదాశివయ్యగారు దాసుగారిచే హరికథ చెప్పించి ముప్పది తులముల బంగారు కడియములతో సత్కరించిరట.

1912-13లలో విజయనగరమున రీవాసర్కార్ రాణీ అప్పలకొండయాంబగారు దాసుగారిచే చెప్పించుకొన్న మూడు హరికథలలో రుక్మిణీకళ్యాణము విన్నపుడు సంతోషపరవశమై యేమి కావలయునో కోరుకోమ్మన్నపుడు – దాసుగారు "**ఈశ్వర కటాక్షముకన్న కోరదగిన వస్తువేమున్న**"దనిరి. ఆ కాలములోనే దాసుగారు కాశీయాత్రచేసిరి. అలహాబాదులో సుప్రసిద్ధ గాయనీమణి జానకీబాయి దాసుగారి మేఘగంభీర స్వరమునకును, హిందుస్తానీ బాణీకిని విస్మితురాలయ్యేరట.

1914లో చల్లపల్లి ప్రభువులు శ్రీరాజా అంకినీడు మల్లికార్జున ప్రసదరావుగారు దాసుగారి నాహ్వానించి, కుడి యెడమ చేతుల సమవిషమ జాతులను వీణా వాదనము చేసిన దాసుగారి ప్రజ్ఞా విశేషమునకు మెచ్చుకొని బంగారు గండ పెండేరమును బహూకరించిరి.

1923లో కాకినాడ కాంగ్రెసు సమావేశ సందర్భమున దాసుగారు 'రుక్మిణీ కళ్యాణము' హరికథ చెప్పినప్పుడు, ఆ హరికథ విన్న సరోజినీదేవి **"your dance is exquisite"** అని శ్లాఘించినారట.

1923లో ఇంగ్లండులో జరిగిన 'ఎంపైర్ ఎక్సిబిషన్' నకు భారతీయ సంగీతమునకు ప్రతినిధిగా దాసుగారే ఎన్నికయిరి – కాని ఆ వయసున నచటి శీతల వాతావరణమునకు తట్టుకొనుట కష్టమని ఆప్తమిత్రుడు బార్డ్స్ వెల్ దొర సలహాతో వారి ప్రయాణము ఆగిపోయినది.

1927లో మదరాసులో జరిగిన అఖిలభారత సంగీత పరిషత్ ప్రారంభోత్సవములో కొన్ని లోకోత్తరములైన "స్వరాక్షర" కృతులను, స్వరచితములను గానముచేసి దాసుగారు ఆచార్య పి. సాంబమూర్తి ప్రభృతుల మన్ననలు వడసిరి.

1931లో గుంటూరులో జరిగిన యేడవ ఆంధ్రగాయక మహాసభకు దాసుగారి నద్యక్షులుగా నెన్నుకొనిరి.

తేది 9-11-1933న తునిలో '**బ్రహ్మరధ**' సన్మానము శ్రీ దాసుగారికి తుని పౌరులవలన జరిగినట్లు 13-11-1933 నాటి హిందూ పత్రిక, ఆంధ్రపత్రిక తెలుపుచున్నది.

**వయోవృద్ధుడు - నృత్య నిత్య యౌవనుడు** -- సెప్టెంబర్, 1935 లో రాజమహేంద్రవరము మ్యూజిక్ అకాడమీ దసరా మహోత్సవములలో హరికథా గానము చేసిన దాసుగారిట్లు ప్రశంసింపబడిరి – "It is remarkable that though Mr. Narayana Das is nearly 72 years old, he kept the packed ball spell-bound and made the function a great success. In spite of the old age, Mr Das danced like a young man of 25". (Indian Express, 30 Sep 1935)

మదరాసులో పలుతడవలు హరికథలు చెప్పిన దాసుగారు 1938లొ అచటి ఆంధ్ర మహాసభ వారిచే సన్మానము లందిరి.

'**హరిదాస జగద్గురువు**' - 'ఆంధ్ర దేశానుభంధము' లో దాసుగారు హరికథకాగ్రేస్వరులు గాను, ఎందరో హరికథకులకు గురుపీఠముగను, కవిగా గాయకుడుగా, భాహుభాషావేత్తగా బహుధా ప్రస్తుతింపబడిరి. (Indian Express, 23-9-1941)

'గాయక సార్వభౌమ' కీ. శే. శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారు దాసుగారిని ఒక లేఖలో - '**సంగీత సరస కవితాది సకల కళాప్రపూర్ణ**' గా అభివర్ణించారు.

1944 నవంబర్ ఆంధ్రపత్రికలో శ్రీ శ్రీనివాస శిరోమణిగారు దాసుగారి గురించి - " ... దక్షిణాపధంలో సంగీతంలో అంతవాడు ఇంత వరకూ పుట్టలేదు. త్యాగయ్య సంగీతంలో ప్రాధమికంగా తేలికగాచేసిన పనులు శ్రీ నారాయణదాసు అతి సమగ్రంగా సప్రమాణంగా ప్రౌడంగా ప్రదర్శించి చూపాడు" అని వ్రాసారట.

శ్రీ దాసుగారి 'ఉమర్ ఖయాం' విజయనగర మహారాణి ప్రోత్సాహమున వ్రాయబడుటచే రాణిగారు ఆ గ్రంధం అచ్చువేసి డాక్టర్ S. రాధాకృష్ణగారికి పంపి వారిచే తొలిపల్కు వ్రాయించారట. ఆ పలుకులివి **"I was greatly struck by his varied talents, remarkable linguistic equipment and technical Power of versification ..... I am tempted to congratulate him on Performance which taking al things into account is certainly astounding."**

**"The Embodiment of Perfect Harikatha"** seems to be his real name and the name given him by parents, merely 'an-ick name', 'a nick name', Adibhatla Narayanadas. --- By Acharya Ekkirala Bharadwaja, M.A. in his article titled 'Harikatha and Sri Narayanadas'

తేది 30-8-1964న దాసుగారి శతజయంత్యుస్తవ సందర్భముగా ఆనాటి ఆంధ్రప్రభ ఆదివారము సంచికలో దాసుగారు గురించి యొక ప్రత్యేక వ్యాసములో 'ఒకటి రెండు విద్యలలో అసమానులుగా పాటించదగిన వారుండవచ్చు. కాని ఏక కాలంలో అనేక విద్యలలో, అనేక కళలలో ఆరితేరి అన్నిటా సమధిక ప్రజ్ఞావంతుడుగా సకల కళానిధిగా పరిణగించ దగిన వ్యక్తి అరుదుగా మాత్రమే ప్రభవిస్తాడు. శతజయంతి మహోత్సవ సందర్భంగా నేడు మనం సంస్మరిస్తున్న యశశ్శరీరుడు శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు అపురూపమైన అట్టి మహావ్యక్తి అనడానికి సందేహంలేదు .. ఇట్టి పుంభావ సరస్వతికి శతవార్షిక జయంతి సందర్భంగా యావదాంధ్రజాతి జోహారులర్పించడం సర్వసమంజసం .. "

దాసుగారి జీవిత చరమక్షణమున, వారి ప్రియ శిష్యులు నేతి లక్ష్మీనారాయణ భాగవతులు అక్కడనే గరుడాళ్వారువలె కాచుకొనియున్నారుట. గురువులు పరమపదించగానే వీరు తమ స్వస్థలమైన విజయవాడకు విచ్చేసి అచిరకాలమున "శ్రీ నారాయణదాస హరికధాగాన కళాపరిషత్తు" స్థాపించి ఏటేట దాసుగారి ఆరాధన ఉత్సవములు అతివైభవముగా జరిపించేవారు. అలా వారు గురువుల ఋణం తీర్చుకున్నారు కనుకనే తనంతటి శిష్యుల్ని తయారు చేసుకోగలిగారు. నేతివారి శిష్యులలో సర్వశ్రీ కర్రెడ్ల సుబ్రహ్మణ్యశాస్త్రి, కుప్పా వీర రాఘవయ్య, కావురి సుబ్రహ్మణ్యశాస్త్రి,

వెంపటి సుబ్బన్నారాయణ, ముట్నూరి కుటుంబరాయశాస్త్రి, ములుకుట్ల సదాశివశాస్త్రి, బుర్రా శివరామక్రిష్ణ శర్మ, అంబడిపూడి శివరామక్రిష్ణ శర్మ తదితరులు గలరు.

సువిశాలమైన శిష్యసంపదగల దాసుగారికి, దాసుగారి ప్రియ శిష్యులు **'హరికథా కేసరి' 'హరికథా ప్రవీణ'** నేతి లక్ష్మీ నారాయణ భాగవతులు (1897-1979) తమ గురువుగారికి విజయవాడ, సత్యనారాయణపురం, శివాలయ ప్రాంగణములో తేది 25-1-1951న ఆగమోక్తముగా విగ్రహ ప్రతిష్ఠ చేసి, ఆలయము నిర్మించి నిత్య పూజాదికములు మరియు ప్రతీ సంవత్సరము దాసుగారి జయంతి (శ్రావణ బహుళ చతుర్దశి) మరియు వర్ధంతి (పుష్య బహుళ పంచమి) ఉత్సవములు ఘనంగా మూడు రోజులు దాసుగారి రచనలతొ హరికథా మహోత్సవములు జరిపించేవారు.

నేతి లక్ష్మీ నారాయణ భాగవతులవారి మరణాంతరము, శ్రీ దాసుగారి శిష్య ప్రశిష్య భక్త బృందం దాసుగారి జయంతి మరియు వర్ధంతి ఉత్సవములు నేటికినీ ఘనంగా మూడు రోజులూ కొనసాగిస్తున్నారు. దాసుగారి జయంతి ఉత్సవములలో మొదటి రోజు కీ. శే. నేతి లక్ష్మీ నారాయణ భాగవతుల సంస్మరణ దినముగా జరిపిస్తూ, ఆ రోజు నేతి వారి కుటుంబ సభ్యులు ఒక ప్రముఖ హరిదాస వర్యులను ఘనముగా సన్మానిస్తారు. ఆఖరి రోజున శిష్య ప్రశిష్య భక్త బృందం మరొక ప్రముఖ హరిదాసులను శ్రీనారాయణదాసుగారి పేర సన్మానిస్తారు.

నారాయణదాసవర్యుల సంప్రదాయన్ని కొనసాగిస్తున్న శిష్యపరంపర హరికథా పతాకం దిగజారకుండా ఆలయ మండపాలలోను, సంగీత సభలలోను, రేడియో - టీవిల లోను కథాకాలక్షేప కళను కాపాడుకొంటున్నారు. దీనికి తూ. గో. జిల్లాలోని సర్వరాయ హరికథా శిక్షణ కేంద్రం ప్రశస్తమైన క్రుషి చేస్తోంది.

త్యాగరాజుతో నేస్తం కట్టడానికో, లేక విద్యావివాదానికో అన్నట్లు సరిగ్గా త్యాగరాజాస్తమయ తిథియైన పుష్య బహుళ పంచమినాడే నారాయణదాసుగారు స్వర్గలోక గతులైనారు. ఇట్టి పుంభావ సరస్వతి నభూతో నభవిష్యతి.

**'ఓం నారాయణదాస గురుభ్యో నమః'**

(శ్రీ నారాయణదాసు మరియు దాసుగారి ప్రియ శిష్యులు **'హరికథా కేసరి' 'హరికథా ప్రవీణ'** నేతి లక్ష్మీ నారాయణ భాగవతులు ((1897-1979) జయంతి సందర్భమున ఈ వ్యాసం ప్రచురింపబడినది)

సంకలనం : యనమండ్ర వెంకట క్రిష్ణయ్య, కీ. శే. నేతి లక్ష్మీ నారాయణ భాగవతులవారి మనుమడు.

COMMENTS